క్లుప్తంగా

నేటి నుంచి గీతాజయంతి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లైటుపాళెం సెంటర్‌లోని ఎంవీఎస్ ధ్యానకేంద్రంలో శనివారం నుంచి 11వ తేదీ వరకు గీతా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో కైవల్య సత్సంగ్ వ్యవస్థాపకుడు కైవల్య తీర్థస్వామి, మాతృశ్రీ జ్ఞానేశ్వరమ్మ పాల్గొంటారని పేర్కొన్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భగవద్గీతా పారాయణం, ఉపన్యాసాలు, ప్రవచనాలు, సాయంత్రం 5 నుంచి 8 వరకు విష్ణు సహస్రనామ పారాయణం, ప్రవచనాలు, ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కైవల్య తీర్థస్వామి శిష్యులు కోరారు.

శాంతి భద్రతలను కాపాడుతాం

కలసపాడు : శాంతి భద్రతలను కాపాడుతామని కలసపాడు ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపారు. కలసపాడు ఎస్ఐగా శుక్రవారం ఘనమద్దిలేటి బాధ్యతలు స్వీకరించారు. మైదుకూరు అర్బన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఈయన బదిలీపై కలసపాడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ చిరంజీవి మైదుకూరు అర్బన్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలతో పాటు, శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు.

మెగా పేరెంట్స్ డేకు హాజరుకండి

బద్వేలు (వ్యవసాయం): ప్రభుత్వ పాఠశాలల్లో నేడు (శనివారం) జరుగనున్న మెగా పేరెంట్స్ డేకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని బద్వేలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల పురోగతి, వారి నడవడిక గురించి విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖిగా చర్చించేందుకు ప్రభుత్వం మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు తీసుకుంటున్న నిర్ణయాల్లో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



రాజీవ్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఉక్కు సాధన ఐక్య వేదిక నాయకులు

ప్రొద్దుటూరు : జిల్లాలో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఉక్కు సాధన ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజీవ్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉక్కు సాధన ఐక్య వేదిక ప్రొద్దుటూరు కన్వీనర్ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విభజన సందర్భంగా చట్టంలో పొందుపరచడం జరిగిందన్నారు. వరుసగా 11 ఏళ్లు కేంద్రంలో బీజేపీ పరిపాలన సాగుతోందన్నారు. ఇంత వరకు స్టీల్ ప్లాంట్ గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో సంబంధిత మంత్రి మాట్లాడుతూ మా దృష్టిలో కడప జిల్లా స్టీల్ ప్లాంట్ లేదని చెప్పడం జిల్లా ప్రజలను అవమానించడమేనన్నారు. నాయకులు విజయ్‌కుమార్, ముంతాజ్ బేగం, రాములమ్మ పాల్గొన్నారు.

పరామర్శ

పోరుమామిళ్ల: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుని విశ్రాంతి తీసుకుంటున్న రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్, పార్టీ నాయకులు రాజీవ్‌బాషా, రాళ్లపల్లె నరసింహులు, చాపాటి నారాయణరెడ్డి, ఎంపీటీసీ మహబూబ్‌పీరా, రవిచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, మాలకొండయ్య, తులసి సురేష్, సాయి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి రైతు వర్రీ!

- తుపానుతో దెబ్బతిన్న పంట
- దళారుల చేతివాటం
- గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్న అన్నదాత

ఖాజీపేట : వరి రైతుకు ఫలితం దక్కడం లేదు. ధరలు ఘోరంగా పడిపోయాయి. అకాల వర్షాలకు కూడా దిగుబడి రాలేదు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయిన తరుణంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు దగా పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక, రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో మద్దతు ధర అందని ద్రాక్షగా మారింది. పెట్టుబడి కూడా గిట్టుబాటు కాక అన్నదాత అప్పుల పాలవుతున్నారు.

తగ్గిన ధర

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట కోతకు వచ్చింది. ఇప్పటికే చాలా మంది రైతులు యంత్రాల సాయంతో నూర్పిళ్లు పూర్తి చేసుకున్నారు. 8 బస్తాలు కలిపి పుట్టిగా రైతులు వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో జిగిత్యాల రకం ధర పుట్టి ధర రూ. 10,500 నుంచి 11,500 వరకు పలుకుతోంది. మామూలు రకం అయితే రూ. 9 వేల నుంచి రూ. 10,500 వరకు దళారులు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. గతేడాది జిగిత్యాల రకం వడ్లను రూ. 16 వేల నుంచి 17 వేల వరకూ, ఎన్‌డీఎల్ రకం రూ .18 వేలకు విక్రయించామని రైతులు అంటున్నారు. ఈ సారి దళారులు కుమ్మక్కై తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు.

ఎదురు చూపులు

మార్కెట్‌లో ధరలు లేనప్పుడు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేసేది. మొదటి రకం క్వింటాల్ ధర రూ. 2,320, రెండవ రకం రూ. 2,300 నిర్ణయించింది. అయితే ప్రభుత్వం చెప్పిన ధరకు ఎక్కడా కొనుగోలు జరగడం లేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయపోవడంతో రైతులకు ప్రైవేటు వ్యాపారులే దిక్కయ్యారు. ఇదే అదనుగా వ్యాపారులు ధర తగ్గించి దగా చేస్తున్నారు. అంతే కాదు.. తరుగు పేరుతో బస్తాకు ఐదు కిలోలు అదనంగా తూకం వేసుకుని దోపిడీ చేస్తున్నా.. తూనికలు కొలతల అధికారులు అటువైపు వెళ్లడం లేదు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేపడితే రైతుకు భరోసాతో పాటు కనీస మద్దతు ధర అందుతుంది. మద్దతు ధర కోసం కర్షకులు ఎదురుచూస్తున్నారు.



యంత్రం సాయంతో వరి పంటను కోస్తున్న రైతులు

నష్టపరిహారం ఇవ్వాలి



తుఫాను కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే పరిహారం అందించాలి. కనీస మద్దతు ధరతో వరి పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. ఎరువులు, పురుగు మందుల ధర పెరగడంతో ఈ ఏడాది పెట్టుబడి అదనంగా వచ్చింది.

– వీపీ రాఘవరెడ్డి, అగ్రహారం మాజీ సొసైటీ అధ్యక్షుడు

సీఎం చంద్రబాబు దళిత ద్వేషి

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి చంద్రబాబుకు దళితులంటే ప్రేమ, గౌరవం లేదని, ఆయన దళిత ద్వేషి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం దళితులకు స్వర్ణ యుగం వంటిదని తెలిపారు. పేదల చదువు కోసం విద్యారంగంలో ఎన్నో మార్పులు తెచ్చారని, వారి కోసమే ఇంగ్లీషు మీడియం, ఆర్థిక పరిపుష్టి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. విజయవాడలో అంబేడ్కర్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేసి అందరి మనసులను జగన్ గెలుచుకున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్ పేరు ఉందని తొలగించారని విమర్శించారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

చంద్రబాబు ప్రభుత్వం అంబేడ్కర్ సిద్ధాంతాలకు విరుద్ధంగా నిరంకుశంగా పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ పరిపాలన హిట్లర్ పాలనను తలపిస్తోందన్నారు. ఎదురు తిరిగిన దళితులపై కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్నారని మండిపడ్డారు. అంబేడ్కర్ ఆశయాలను పరిరక్షించేందుకు, ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు సత్యం, గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు చౌడం రవి, బాషా, ప్రకాష్, బీఎస్ఆర్, మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వికాస్ విహార్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మలాదేవి

కలసపాడు : గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బోదనబోయిన నిర్మలాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయం పాటించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు పక్కాగృహాలు, రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని, అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, సచివాలయ సెక్రటరీలు స్పందించి తాగునీటి బోర్ల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఏపీఓ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పండ్లతోటలు, పశువులకు గడ్డి పెంపకం వంటివి ఉచితంగా ఉన్నాయని, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో రాజుపాలెం సర్పంచ్ సూదారామకృష్ణారెడ్డి, అంకనగురివిరెడ్డి, నారాయణయాదవ్, ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఈఓపీఆర్‌డీ మురళీమోహన్, పశు వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిప్రియ, వైద్యాధికారి సాయితేజ, వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో స్వాగతం



కామనూరు ఎస్సీ కాలనీలో మురుగు నీటిలో నడుస్తున్న అధికారుల బృందం

ప్రొద్దుటూరు రూరల్ : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామమైన కామనూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ సదస్సుల ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పులివెందుల ఇన్‌చార్జి ఆర్డీఓ అనురాధ, మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, తహసీల్దార్ గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డి, రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ, మరికొంత మంది అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమానికి ముందు అధికారుల బృందం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. అయితే ఎస్సీ కాలనీలోని మొదటి ఇంటి వద్ద నుంచి చివరి ఇంటి వరకు అధికారుల బృందానికి మురుగు నీరు స్వాగతం పలికింది. కాలనీలో డ్రైనేజీ కాలువలు లేకపోవడం వలన మురుగు నీటిని రోడ్లపైకి వదిలేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



ఏఎంఎల్‌నగర్‌లో నీటి సరఫరాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏఎంఎల్‌నగర్‌లో కొన్నేళ్లుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించి శుక్రవారం తాగునీటిని అందించారు. కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ గతంలో ట్యాంకర్ ద్వారా నీటిని పొందుతున్న ఏఎంఎల్‌నగర్ ప్రజలు ప్రస్తుతం పైపులైను ఏర్పాటు చేయడం ద్వారా 300 కుటుంబాలకు తాగునీటి సమస్య తీరిందని అన్నారు. ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అక్రమ కుళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించుకోవాలని కోరారు. అలాగే అనుమతి లేకుండా కుళాయి కనెక్షన్ తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సకాలంలో ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ మహేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం



బద్వేలు అర్బన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధ



పోరుమామిళ్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్: ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయమని బి.ఆర్.అంబేడ్కర్ అని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక నెల్లూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అంబేడ్కర్ చేసిన సేవలు ఘనీయమని, దళితవర్గాలకు రిజర్వేషన్లు కల్పించడంలో ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. దళితులు రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందారంటే అంబేడ్కర్ లాంటి మహనీయుల కృషి ఫలితమేనన్నారు. ఆయన స్ఫూర్తితో గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం రాజ్యాంగం ద్వారా అనేక చట్టాలకు ఊపిరి పోసిన అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇమ్మానియేల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణలు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, దళిత నాయకులు పిచ్చయ్య, నాగరాజు, బాబూరావు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో..

అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బద్వేలు పట్టణాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి, సీనియర్ దళిత నాయకులు పిచ్చయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక జ్యోతిబసు కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, నాగేంద్రబాబు, చిన్ని, శివ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు కృషి చేయాలి

పోరుమామిళ్ల: బీఆర్ అంబేడ్కర్‌కు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పోరుమామిళ్లలో శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన అంబేడ్కర్ ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. వైస్ ఎంపీపీ రాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, సీనియర్ నాయకులు గురివిరెడ్డి, ఎంపీటీసీ మహబూబ్‌పీరా పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా పీసీసీ సభ్యులు డాక్టర్ అన్వర్, మానవ హక్కుల సంఘం నేతలు, సీపీఎం నేతలు శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అన్వర్, భైరవప్రసాద్, గంగన్న, ఫణిరావు, శ్రీనివాస రెడ్డి, దళితనాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని దళిత నాయకలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణయాదవ్, దళిత నాయకులు పగిడిథామస్, లింగారెడ్డిపల్లె ఎంపీటీసీ రమేష్, యేసురత్నం, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బి. మఠంలో ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ, టీడీపీ, ఎమ్మార్పీఎస్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జోగయ్య, సుబ్బరాజ, సునీల్, తదితరులుపాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

దువ్వూరు : దువ్వూరులోని బంగ్లాలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆవిష్కరించారు. తహసీల్దార్ అక్బల్ బాషా, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఉపాధి హామీ పథకం ఏపీఓ డాక్టర్ వసంతకుమార్, నాయకులు బోరెడ్డి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఏపీ రాష్ట్ర మాలమహానాడు (విజయశేఖర్ వర్గం) రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, గూడెం చెరువు సంపత్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్ బాబు, ఏపీ రాష్ట్ర మాలమహానాడు నాయకులు జేష్టాది పవన్, డానియల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



ప్రొద్దుటూరు రూరల్ : మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీఓ అనురాధ



బి.కోడూరు : రెవెన్యూ సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్



చాపాడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రొద్దుటూరు రూరల్ : వ్యవసాయ భూములకు సంబంధించిన అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, ప్రతి రైతు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ సదస్సులకు సంబంధించి ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పులివెందుల ఇన్‌చార్జి ఆర్డీఓ అనురాధ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల వద్దకే రెవెన్యూ అధికారులు వచ్చి సమస్యలను తెలుసుకుని 45 రోజుల్లో పరిష్కరించే దిశగా కార్యాచరణ తయారు చేస్తున్నామన్నారు. పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను తెలుసుకుని సమస్య పరిష్కరిస్తామన్నారు. డీఐ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారిణి సుభాషిణి, డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్ రెడ్డి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దువ్వూరు : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఇమ్రాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బలక్కివారిపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు, ప్రజలు సదస్సులకు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ అక్బల్ బాషా, భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, మండల సర్వేయర్ పద్మావతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

చాపాడు: పార్టీలకతీతంగా రైతు భూ సమస్యలు పరిష్కరించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కేతవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నయ్య, తహసీల్దారు రమాకుమారి, డీటీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గురివిరెడ్డిపాల్గొన్నారు.

బి.కోడూరు : భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొండంపల్లె గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతో కాలంగా పరిష్కారం కాని భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయశాఖ జేడీ, స్పెషలాఫీసర్ చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు మధునాయక్, సర్వేయర్లు, వీఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : ప్రజలు భూ సమస్యలను రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రంపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేయాలన్నారు.

సర్పంచ్‌లకు అందని సమాచారం

కలసపాడు : గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌లకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులపై కనీసం సమాచారం ఇవ్వడం లేదని రాజుపాలెం సర్పంచ్ సూదారామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, నారాయణయాదవ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లువారిపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రథమ పౌరుడుగా ఉండే సర్పంచ్ అంటే కూటమి ప్రభుత్వానికి ఎందుకంత చులకన భావమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారులు వెంటనే సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దారు మధురవాణిని వివరణ కోరగా వీఆర్‌ఓల ద్వారా సర్పంచ్‌లకు సమాచారం అందించామని, గత ప్రభుత్వంలో సచివాలయాలను ఏర్పాటు చేసి అందులో వారికి ఒక గదిని కేటాయించారని, వారు వచ్చి ఆ గదిలో కూర్చోవచ్చని తెలిపారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ కె.మురళీమోహన్ పేర్కొన్నారు. స్థానిక సుందరాచార్యుల వీధిలోని ఎస్‌కే గ్రాండ్‌లో శుక్రవారం ఎంఎస్ఎంఈ క్లస్టర్ మీట్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంకులో పారిశ్రామిక వేత్తలకు వివిధ ఆకర్షణీయమైన స్కీంలు ఉన్నాయని, వీటిని ఉపయోగించుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణాలు, సేవలను, కల్పించే సౌకర్యాల గురించి వినియోగదారులకు వివరించడానికి క్లస్టర్‌మీట్ సమావేశాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ మేనేజరు ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా మహిళల కోసం మహిళా వికాస్ స్కీం, ఎంఎస్ఎంఈ కాంట్రాక్టర్స్ స్కీం, బిజినెస్ లోన్స్, వ్యవసాయ, విద్య, వ్యక్తిగత, రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. సమావేశంలో పట్టణంలోని కెనరా బ్యాంకు మెయిన్, జిన్నారోడ్డు, గాంధీరోడ్డు, జమ్మలమడుగు, ముద్దనూరు, చిలంకూరు బ్రాంచీల మేనేజర్‌లు, సిబ్బంది,యువకులు పాల్గొన్నారు.



శుక్రవారం రాజంపేటలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ తదితరులు

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

చాపాడు: మండల పరిధిలోని లక్ష్మీపేట పంచాయతీ కార్యదర్శి వెంకట నారాయణకు శుక్రవారం మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. లక్ష్మీపేటలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ప్రజలు పంచాయతీ కార్యదర్శి వెంకట నారాయణ విధులు సరిగా హాజరుకావటం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో లక్ష్మీపేట కార్యదర్శి వెంకట నారాయణకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.